క్లుప్తంగా

19న మెగా వైద్యశిబిరం

చిల్పూరు: ఈనెల 19న చిన్నపెండ్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆకుల సాయికిరణ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా ఎలాంటి ముందస్తు లక్షణాలు లేకుండా ఆకస్మికంగా గుండెపోటుతో ఎందరో మృతి చెందుతున్నారని అన్నారు. 2డీ ఎకో, ఈసీజీ, అన్నిరకాల వ్యాధులు, కంటి పరీక్షలను మెడికవర్, వాసన్ ఐకేర్ హాస్పిటల్, వినాయక యూత్ అసోసియేషన్ సహకారంతో శిబిరం ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

చేయూత

లింగాలఘణపురం : మండల కేంద్రానికి చెందిన ఎడ్ల సుమతమ్మ భర్త చనిపోయి అనారోగ్యానికి గురి కాగా ప్యాట రవి ఆమెకు 25 కిలోల బియ్యంతో పాటు మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షుడు రాంచందర్, వీడీసీ కోశాధికారి రమేష్, నాయకులు రమేష్, సంజీవ, మల్లేశ్, ప్రవీణ్, యాకయ్య, రంజిత్ ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ



జనగామ : కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి సత్తెమ్మ ఇటీవల మృతి చెందగా మద్దూరు మండలం నర్సాయపల్లిలో ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. కొమ్మూరితో పాటు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ఓదార్చారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కొమ్మూరిని పరామర్శించారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బాలచారి అలాగే కర్రె వజ్రమ్మ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ ఆర్థికసాయాన్ని అందించారు. ఆదివారం బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 5 వేలను అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో నాయకులు కోడూరి మహాత్మాచారి, కర్రె నరేష్, జంపయ్య, గుర్రం బాల్‌రాజు, దాచేపల్లి రాజయ్య, కిష్టయ్య, భాస్కర్, రవి, కర్ణాకర్ ఉన్నారు.

బియ్యం అందజేత

పాలకుర్తి : మండల కేంద్రానికి చెందిన కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం కాంగ్రెస్ మండల నాయకుడు ఎడవెల్లి సోంమల్లయ్య ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యను అందించారు. ఆయన వెంట మాజీ వార్డు సభ్యుడు ఎడవెల్లి వెంకటేశ్వర్లు, సుభాష్, గూడూరు లెనిన్, డాక్టర్ యాకసోమయ్య ఉన్నారు.

'పరపతి సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తాం'



జనగామ : పరపతి సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు చెప్పారు. మండలంలోని పెంబర్తి విశ్వకర్మ పరపతి సంఘం 30వ వార్షికోత్సవం మాజీ అధ్యక్షుడు కాలూరి మల్లికార్జునచారి అధ్యక్షతన ఆదివారం జరిగింది. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా రుద్రోజు శ్రీనివాసాచారి, కార్యదర్శి మల్యాల జనార్ధనాచారిలను ఎన్నుకున్నారు. అనంతరం మాజీ కార్యదర్శి రాగిబాలచారి మరణించగా ఆయనకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మాజీ అధ్యక్షుడు కాలూరి మల్లి కార్జునచారి చేసిన సేవలను గుర్తించి ఆయనను ఘనంగా సత్కరించారు.

21న హుండీ లెక్కింపు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 21న శుక్రవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ కల్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు : పద్మశాలి చేనేత సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోతె విక్రమ్, గౌరవ అధ్యక్షుడిగా రేగొండ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పెండెం వెంకన్న, కోశాధికారిగా మోతె శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు మోతె విక్రమ్ తెలిపారు.

జనసంద్రంగా స్టేషన్‌ఘన్‌పూర్

- సీఎం సభకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు
- పోలీసుల ముందు జాగ్రత్తతో అంతరాయంలేని ట్రాఫిక్
- సీఎం మాట్లాడుతుండగానే సభ నుంచి బయటకు వచ్చిన జనం



సీఎం సభకు డప్పుచప్పుళ్లతో వస్తున్న కళాకారులు

జఫర్‌గఢ్/చిల్పూరు : సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ జనసంద్రంగా మారింది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పలు రహదారులు, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని వీధులన్నీ జనసంద్రంతో కిక్కిరిసి పోయాయి. గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు, డీసీఎం, ట్రాక్టర్లు, ఆటోలతో పాటు పలు వాహనాల్లో ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. శివునిపల్లిలో సీఎం బహిరంగ సభ జరుగుతండడంతో ట్రాఫిక్ సమస్య ఎదురుకాకుండా జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ నేతృత్వంలో ముందస్తు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఎప్పటికప్పుడు డీసీపీ ద్విచక్రవాహనంపై ట్రాఫిక్ సమస్య ఎదురు కాకుండా పర్యవేక్షించారు. సభ ముగిసిన తర్వాత కూడా సభకు వచ్చి ప్రజలు వారి వాహనాల్లో సజావుగా ఇంటికి వెళ్లేలా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో సభ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎండ తీవ్రతతో సభకు వచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారు. సభా ప్రాంగణం వద్ద వాటర్, మజ్జిగప్యాకెట్లు ఏర్పాటు చేసినప్పటికీ సరిపడా లేక పోవడంతో వాటర్ ప్యాకెట్ల కోసం ప్రజలు ఎగబడ్డారు.

సీఎం ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన ప్రజలు

సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చినప్పటికీ మంత్రులు మాట్లాడిన తర్వాత చివరగా సీఎం మాట్లాడుతుండగా ప్రసంగానికి 5 నిమిషాల ముందుగానే సభా ప్రాంగణంలో కూర్చున్న ప్రజలు వెనుదిరిగారు. సభా ప్రాంగణం ముందు ఎమ్మెల్యే శ్రీహరి భారీ కటౌట్లు ఆకర్షణీయంగా నిలిచాయి.



డ్రెస్‌కోడ్‌తో సభకు వస్తున్న డ్వాక్రా మహిళలు



సభకు తరలివస్తున్న మహిళలు



నీళ్ల ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న ప్రజలు

సీఎం సభతో షాపులు బంద్

- ఇబ్బందులకు గురైన ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం పర్యటన, బహిరంగ సభ నేపథ్యంలో స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలో ఆదివారం పలు షాపులను పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బంద్ చేయించారు. హోటళ్లు, కూరగాయల షాపులు, చికెన్, మటన్ సెంటర్లను సైతం బంద్ చేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సీఎం పర్యటన నేపథ్యంలో భారీగా మోహరించిన పోలీసులు ముందస్తుగా ఘన్‌పూర్ పట్టణంలో పలు షాపులను బంద్ చేయడంపై వ్యాపారులు, ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. షాపులు బంద్‌తో పట్టణం నిర్మానుష్యంగా కనిపించింది.



మూసి ఉన్న షాపులు

బస్సులు లేక ప్రయాణికుల పాట్లు

జనగామ రూరల్ : సీఎం పర్యటనలో భాగంగా ఆదివారం జనగామ నుంచి సుమారు 80 బస్సులు స్టేషన్ ఘన్‌పూర్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌కు, హనుమకొండతో పాటు జనగామ చుట్టుపక్కల గ్రామాలకు బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. రఘునాథపల్లి నుంచి జనగామకు హనుమకొండకు వెళ్లే వారు గంటల తరబడి వేచి ఉన్నారు. కొమురవెల్లి దేవస్థానానికి బస్సులు అందుబాటులో లేక ఆటోలు సుమోలను మాట్లాడుకొని వెళ్లారు.



బస్టాండ్ వద్ద కొమురవెల్లికి ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి



పాలకుర్తిటౌన్ : తెలంగాణ సాంస్కృతిక సారథిలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమ కళా కారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని, అసెంబ్లీలో సమస్యలపై మాట్లాడతానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ కళా కారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు ప్రవీణ్‌కుమార్, రమేశ్, చిరంజీవి, లింగయ్య పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

బచ్చన్నపేట : స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కొన్నె ఎల్లమ్మ- కిష్టయ్య దంపతుల కూతురు మానస వివాహానికి వాస్విక్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం పుస్తెమట్టెలను అందించారు. ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డిల ఆదేశాల మేరకు పుస్తెమట్టెలు అందించారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

జనగామ రూరల్ : మండలంలోని వెంకిర్యాల గ్రామంలో నిరుపేద దళిత కుటుంబం కర్రె సాయిలు-స్వరూప పేదింటి ఆడబిడ్డకు అఖిల వివాహానికి ఆదివారం దళితబహుజనుల ఆశాజ్యోతి టీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు తాళ్లపల్లి శివరాం గౌడ్ రూ.15,016ల విలువ గల పుస్తెమట్టెలు ఇచ్చి మానవత్వం చాటుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఎన్నో ఏళ్ల తర్వాత పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోవడంతో పాటు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాలలో రూ.1.50 లక్షలతో స్టేజీని నిర్మించి గురువుల చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి ఏడుదొడ్ల శ్రీధర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'

పెద్దవంగర : అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటన నేపథ్యంలో ఆదివారం మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, విడుదల చేశారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీజేపీ నాయకులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

ఫలితాల్లో 'కస్తూర్బా' ఆదర్శం

- పన్నెండేళ్లుగా 'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత
- ఈసారి కూడా ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు



స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థినులు

కొడకండ్ల: గడిచిన పన్నెండేళ్లలో నూరు శాతం ఫలితాలతో మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం ఆదర్శంగా నిలుస్తోంది. నిరుపేద విద్యార్థుల విద్యాభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కస్తూర్బా విద్యాలయంలో చదువుతున్న బాలికలు సత్తా చాటుతున్నారు. అద్దె భవనంలో ఆరంభమైన విద్యాలయానికి 2010-11 విద్యా సంవత్సరంలో మండల కార్యాలయాల సముదాయంలో సొంత భవనం చేకూరగా అంచెలంచెలుగా మౌలిక వసతులు కూడా కల్పించారు. 2010-11 విద్యా సంవత్సరంలో తొలి పదో తరగతి బ్యాచ్ పరీక్షలు రాయగా ఒక విద్యార్థి ఫెయిల్ కాగా 2013-14లో ఇద్దరు విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఆ తర్వాత అన్ని సంవత్సరాల్లోను నూరు శాతం ఫలితాలతో పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. నూరుశాతం ఫలితాలే కాకుండా విద్యార్థులు కూడా మంచి గ్రేడ్‌లు సాధిస్తున్నారు. ప్రతి ఏటా మంచి ఫలితాలు వస్తుండటంతో పాఠశాలలో అడ్మిషన్లు పొందేందు కోసం విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. మెరుగైన ఫలితాల సాధన కోసం వార్షిక పరీక్షలకు ఐదు నెలల ముందు నుంచే పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా పదో తరగతిలో 40 మంది విద్యార్థులుండగా నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా గత సంవత్సరం నవంబర్ నుంచి ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్‌లు నిర్వహిస్తూ విద్యార్థులను చదివిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థులు కూడా బాగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం



ఈ విద్యా సంవత్సరంలో కూడా నూరు శాతం ఫలితాలు సాధించాలన్నదే లక్ష్యం. మంచి గ్రేడ్‌లు సాధించేలా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు స్టడీ అవర్ నిర్వహిస్తూ విద్యార్థులను చదివిస్తున్నాం. పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయిస్తున్నాం.

- మమత, ఎస్‌ఓ

సీఎం సభకు భారీగా తరలిన పార్టీ శ్రేణులు



జఫర్‌గఢ్: ఓబులాపూర్ నుంచి సీఎం సభకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

జనగామ రూరల్ : స్టేషన్ ఘనపూర్‌లో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రజాసభ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణం, అన్ని మండలాల నుంచి కార్యకర్తలు నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్, మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, మేరుగు బాలరాజు, యూత్ నాయకులు ఉన్నారు.

జఫర్‌గఢ్ : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు వాహనాల్లో సీఎం సభకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివెళ్లడంతో పలు రహదారులు వాహనా ల్లో రద్దీగా మారడంతో పాటు పార్టీ శ్రేణులు చేసిన నినాదాలతో గ్రామాలు హోరెత్తాయి.

చిల్పూరు : మండలంలోని పల్లగుట్ట గ్రామ క్లస్టర్ ఇన్‌చార్జ్, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం సీఎం బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

లింగాలఘణపురం : సభకు మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. బస్సులు, డీసీఎంలు, క్లూసర్లు, ఆటోలతో మహిళలు, యువకులు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దిలీప్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో సభకు వెళ్లారు.

అరెస్టులు, గృహ నిర్బంధాలు





కొడకండ్ల పీఎస్‌లో వివిధ పార్టీల నాయకులు, హౌస్ అరెస్ట్ అయిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

- జిల్లా వ్యాప్తంగా నాయకుల ముందస్తు అరెస్ట్
- మడికొండ పీటీసీకి తరలింపు

జనగామ రూరల్ : సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శని వారం అర్ధరాత్రి నుంచి వివిధ పార్టీల నాయకుల గృహ నిర్బంధం, అరెస్టులు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను ఆదివారం ఉదయం హౌస్ అరెస్ట్ చేసి మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. అలాగే జిల్లా కేంద్రంలో సీపీఎం నాయకులు బూడిద గోపి, జోగు ప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు ఉల్లెంగల సందీప్, ముస్త్యాల దయాకర్, ముష్పట్ల విజయ్, కొర్రా రాజేంద్రనాయక్, ఇరుగు యాకన్న, జనగామ యూత్ అధ్యక్షుడు సందీప్, మాజీ కౌన్సిలర్ ముత్యాల దయాకర్, బీజేపీ నాయకులు మైపాల్, సంతోష్, ఏబీవీపీ నాయకులు తోట రుత్విక్, మహమ్మద్ యూనిస్, ఎల్లయ్య, లక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు మల్లయ్య, ఎల్లయ్య వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు ఎడ్ల మహిపాల్ అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ కోసం చేపట్టిన దీక్షలను రద్దు చేసి అక్రమంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ తీవ్రంగా ఖండించారు.

మండలాల్లో ముందస్తు అరెస్టులు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఆదివారం తెల్లవారు జాము నుంచే వివిధ మండలాల్లో పార్టీల నాయకులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ఘన్‌పూర్ మండల సీపీఎం కార్యదర్శి రమేష్, మాజీ జిల్లా స్టాండింగ్ కమిటీ చైర్మన్ మరపాక రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అరెస్ట్ కాగా రఘునాథపల్లిలో మాజీ ఎంపీపీ కుమార్ గౌడ్, వారాల రమేష్ అరెస్ట్ అయ్యారు. లింగాల ఘనపూర్‌లో శ్రీనివాస్ గౌడ్, కో ఆర్డినేటర్ విజయ్ కుమార్, రాజేందర్ నాయక్, మాజీ సర్పంచ్ మల్లేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగు హరీష్, చిల్పూర్ సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్‌ను నర్మెట మండలం బొంతగట్టు నాగారం వీఆర్ఏ తాటిరా జును పోలీసులు చేసి స్టేషన్‌కు తరలించారు. కొడకండ్ల మండలానికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామోజీ, మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాము, జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సతీష్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. జఫర్‌గఢ్ మండలానికి చెందిన బీఆర్ఎస్ సీపీఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎండి నజీర్, సత్యం, అర్జున్‌లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమస్యలను ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని అరెస్టులతో అభివృద్ధి సాధ్యం కాదని వారు అన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని ప్రజాస్వామికంగా నిరసనలు తెలిపితే అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు.




బచ్చన్నపేటలో నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పారితోషికం విడుదల చేయాలి

తొర్రూరు : ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమరేటర్లకు పారితోషికం విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎస్టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకరాచారి మాట్లాడుతూ సర్వే ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా పారితోషికం మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. ఈ నెల 31 వరకు పారితోషికం విడుదల చేయకుంటే సదరు మొత్తం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. చిరు ఉద్యోగులు పారితోషికం ఇస్తారనే ఆశతో సర్వే విజయవంతం చేశారని, నిధులు కేటాయించినప్పటికీ విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



శేఖర్ (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన మంద శేఖర్(58) ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్ తన ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపుకు సంబంధించిన మోటార్ పనిచేయక పోవడంతో దాన్ని మరమ్మతు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు..



ఉప్పలయ్య (ఫైల్)

దేవరుప్పుల : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చిన్నమడూరులో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిన్నమడూరుకు చెందిన గూడ ఉప్పలయ్య(53) గీత కార్మికుడు ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా కాలు జారి కిందిపడడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఉప్పలయ్య అకాల మరణంపై గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, నాయకులు పరీదుల భాస్కర్, వంగ దశరథ, అర్జున్, నరేష్, యాదగిరి తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గీత కార్మికులకు సెఫ్టీ మోకులు అందించి మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి..

జనగామ రూరల్ : లారీ ఢీ కొట్టిన ఘటనలో బిహార్‌కు చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలోని పోస్టాఫీస్ క్రాస్ వద్ద చోటు చేసుకుంది. బిహార్‌లోని పాట్నాకు చెందిన త్రిబువన్‌కుమార్ (45)ను లారీ ఢీకొనగా కిందపడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ బస్‌స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కారు-స్కూటీ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. చిల్పూరు 108 ఈఎంటీ రాజేంద్రప్రసాద్, పైలట్ అమర్‌నాథ్‌లు అందించిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన అంగిడి వెంకటయ్య ఉదయం తన స్కూటీపై హనుమకొండ నుంచి వస్తూ చిన్నపెండ్యాలలో పని ఉండడంతో రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండకు వేగంగా వెళ్తున్న ఇన్నోవా వాహనం స్కూటీని ఢీకొని డివైడర్‌పైకి ఎక్కింది. ఈ ప్రమాదంలో వెంకటయ్యకు తీవ్రగాయాలు కాగా కారులో ఉన్న అజ్మీరా బేగం, అరోహిసీమన్, షేక్‌గౌస్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.